క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



మునెమ్మకు నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి రూరల్ : మండలంలోని పెరుమాళ్లపల్లె ఉప సర్పంచ్ గడ్డపార వెంకటనారాయణరెడ్డి మాతృమూర్తి మునెమ్మ ఇటీవల కన్నుమూశారు. బుధవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి తదితరులు మునెమ్మ కర్మక్రియలకు హాజరయ్యారు. వెంకటనారాయణ రెడ్డిని పరామర్శించారు. అలాగే సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి సమీప బంధువు తేజా రెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. తేజా రెడ్డి కర్మక్రియలకు హాజరై నివాళులు అర్పించారు. పెరుమాళ్లపల్లె సర్పంచ్ జోగి మోహన్, వార్డు సభ్యులు మునెయ్య, గాంధీపురం మన్నూరు శివ, ముని పాల్గొన్నారు.

వసతుల అప్‌లోడ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల వివరాలను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ శశిరేఖతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌లతో సమావేశం నిర్వహించారు. మనబడి–మన భవిష్యత్తు వెబ్‌సైట్‌లో పాఠశాలల వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఫొటో సైతం అప్‌లోడ్ చేయాలని కోరారు. సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.

మఠం ఆస్తుల రక్షణకు కృషి



బావాజీ సేవలో సంపత్ నాయక్

తిరుపతి రూరల్ /తిరుపతి కల్చరల్ : తిరుపతి నగరంలో హథీరాం బావాజీ మఠం ఆస్తుల రక్షణకు కృషి చేస్తామని జనసేన తెలంగాణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సంపత్‌నాయక్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం పంచాయతీ విద్యుత్ నగర్‌లో ఉన్న హథీరాం బావాజీ ఆలయాన్ని సందర్శించారు. సంపత్ మాట్లాడుతూ మఠం భవనాలను కూల్చవద్దని కోరారు. బావాజీ మఠానికి చెందిన సుమారు 16వేల ఎకరాల భూములను ఆక్రమణ చెర నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. బావాజీ ఆలయం నిర్మిస్తుంటే మఠం అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మఠం భూముల విషయంపై ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మఠం ఆస్తులపై బంజారాలకు హక్కు కల్పించాలని కోరనున్నట్లు వెల్లడించారు. అశోక్ రాథోడ్, బుక్యా శివా నాయక్, సామ్రాజ్ నాయక్, చిన్న శివనాయక్ పాల్గొన్నారు.

జానపద గేయాలపై అవగాహన



మాట్లాడుతున్న రెడ్డెప్ప

రామచంద్రాపురం : మండలంలోని కమ్మకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జానపద గేయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో మన సంస్కృతి కళామండలి సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డెప్ప సహకారంతో జానపద గేయాలపై అవగాహన కల్పించారు. ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్, విశ్వనాథం, వెంకటరామయ్య, కృష్ణార్జున రెడ్డి, బ్రహ్మం, దిలీప్ కుమార్, శాంతి, లీలారాణి పాల్గొన్నారు.

వాకర్స్‌కు బీపీ మిషన్లు



బీపీ మిషన్లు అందిస్తున్న కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్ : వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్లకు సుమారు రూ.2 లక్షల విలువైన 100 బీపీ మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సహకారం అందించిన ఆస్టర్ నారాయణాద్రి ప్రతినిధులు డాక్టర్ శ్రీధర ముని, ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి తుడా : మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను బుధవారం పంపిణీ చేశామని కమిషనర్ మౌర్య తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో డీసీపీ ఖాన్, ఏసీపీలు మూర్తి, మధు, టీపీఓ వంశీ పాల్గొన్నారు.

అంతా వంచన..
అంతులేని వేదన



కనిపించని వారితో ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తోంది. వినిపించని వారు విలపించేలా వ్యవహరిస్తోంది. నడవలేని వారిని నానా యాతనలకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను దయనీయస్థితిలోకి నెట్టేస్తోంది. దైనందిన కార్యకలాపాలను సైతం సొంతంగా నిర్వర్తించుకోలేని వారిని నిర్దాక్షిణ్యంగా వేధిస్తోంది. కుటుంబీకుల సాయం లేనిదే గడప దాటలేని వారిని కుమిలిపోయేలా చేస్తోంది. పెన్షనర్ల సంఖ్యలను తగ్గించడమే అజెండాగా కుట్రలకు తెరతీసింది. నిరుపేద బతుకులను నిలువునా వంచిస్తోంది. అంతులేని ఆవేదనతో అలమటించే దుస్థితిని కల్పించింది.

- పింఛన్లపై కత్తి పెట్టిన ప్రభుత్వం
- రీవెరిఫికేషన్ పేరుతో పెన్షనర్లకు ఇక్కట్లు
- సదరం సర్టిఫికెట్లతో వైకల్య శాతం తగ్గింపు
- దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తప్పని అవస్థలు

తిరుపతి అర్బన్/ చంద్రగిరి : దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులనే కనికరం లేకుండా కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా పింఛన్లు తొలగించడంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. రీవెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారులను నాలుగు నెలలుపాటు అగచాట్లు పెట్టారు. మంచానికే పరిమితమై నానా అవస్థలు పడుతున్నవారికి సైతం వైకల్యం శాతం తగ్గించి పెన్షన్ తొలగించి ఆందోళనకు గురిచేస్తున్నారు. మరోసారి సదరం సర్టిఫికెట్ల కోసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి తీసుకువచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదు వైద్య ఖర్చులకే సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్న తరుణంలో పూర్తిగా తొలగించడంపై లబ్ధిదారులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒక్కక తిరుపతి నగరంలోనే ఇప్పటి వరకు మొత్తం 3,030 మంది దివ్యాంగ పింఛనర్లలో 564 మందికి తొలగించారు. మరికొందరికి పింఛన్ నగదును దారుణంగా తగ్గించేయడంతో లబ్ధిదారులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వారందరూ కూటమి ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు. మరోవైపు సెప్టెంబర్ నుంచి వృద్ధుల పెన్షన్లపై కూడీ రీవెరిఫికేషన్ ఉంటుందని చెబుతుండడం లబ్ధిదారులను మరింత భయపెడుతోంది.



పింఛన్‌ను తొలగించడంతో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న బాధితులు

తగ్గించేశారు



నేను పుట్టుకతోనే దివ్యాంగురాలిని. ఊహ తెలిసినప్పటి నుంచి పింఛను పొందుతున్నా. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్నాళ్ల పాటు ప్రతి నెలా రూ.15వేల పెన్షన్ ఇచ్చారు. అయితే ప్రస్తుతం అధికారులు నాకు వైకల్యం శాతం తగ్గించేయడంతో రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇదేంటని అడిగితే సదరం సర్టిఫికెట్‌లో వైకల్యం తక్కువగా వచ్చిందంటున్నారు. నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యా. పింఛను నగదుతోనే చికిత్స పొందుతున్నా. ఇప్పుడు పింఛనుపై కోత విధించడంతో నడవలేని స్థితిలో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది.

– సాయి జ్యోతి, అగరాల

కంటిచూపు బాగుందంట



నా పుట్టుకతోనే నాకు ఒక కన్ను కనిపించదు. దీంతో 2010లో సదరం సర్టిఫికెట్ మంజూరు చేశారు. అప్పటి నుంచి నేను ప్రభుత్వం ద్వారా పింఛను పొందుతున్నా. గతంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో సైతం ఐదేళ్లపాటు పింఛను పొందాను. అయితే ఇప్పుడు తాజాగా నాకు నిలిపేశారు. ఎందుకని అడిగితే.. అంగవైకల్యం లేదంటున్నారు. 15ఏళ్లుగా వస్తున్న పింఛను ఇలా ఆపేయడం దారుణం. అధికారులు నాకు న్యాయం చేయాలి.

– చైతన్య, చంద్రగిరి

అర్హులందరికీ ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి తుడా : దివ్యాంగ పింఛన్‌ను అర్హులందరికీ పునరుద్ధరించాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. సదరం సర్టిఫికెట్‌లో వైకల్య శాతం తగ్గించి, మోసం చేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నిర్ధారణ చేసుకుని పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు.

తొలగింపులు దారుణం



చంద్రగిరి తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

అర్హులైన దివ్యాంగులకు సైతం సర్వేల పేరుతో పింఛన్లను తొలగించడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఈ విధంగా దివ్యాంగుల పొట్టకొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. వేలాదిమంది పింఛన్లు తొలగించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పందించి తొలగించిన వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నోటీస్ బోర్డు

- పద్మావతి మహిళా వర్సిటీలో ఉదయం 10 గంటలకు డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు.
- నవంబర్‌కు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల.
- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం 3 గంటలకు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన.

వెటర్నరీ వర్సిటీలో అక్రమాలపై ఫిర్యాదు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అక్రమాలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు బుధవారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపాక దాము ఫిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగం, అక్రమ నియామకాలపై సమగ్ర వివరాలను అందించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

24 నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది.

30న టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సంఘం కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. నూతన కార్యవర్గ ఎన్నికపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

పద్మజకు డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా వర్సిటీ పరిశోధక విద్యార్థిని పద్మజకు డాక్టరేట్ ప్రదానం చేసినటుల డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆచార్య సావిత్రి మార్గదర్శకత్వంతో 'ఏ స్టడీ ఆన్ ది నాలెడ్జ్ అండ్ అడాప్షన్ ఆఫ్ సెరికల్చర్ ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్ అమాంగ్ సెరికల్చర్ ఫార్మర్స్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పద్మజ పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు.

హోమ్‌సైన్స్ విభాగంలో లావణ్య..



మహిళా వర్సిటీ హోంసైన్స్ విభాగం పరిశోధన విద్యార్థిని లావణ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు.గర్భిణుల్లో హిమోగ్లోబిన్ స్థితిపై ఇనుము శోషణ కారకాలు ప్రభావాలు పిండం ఎరిత్రోపోయిసిస్, నవజాత శిశువు పై ప్రభావం అనే అంశంపైన డాక్టర్ విజయజ్యోతి పర్యవేక్షణలో లావణ్య పరిశోధన పత్రాలు సమర్పించారు.

ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం



మాధన్నను సన్మానిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎం మాధన్నను దళిత విద్యార్థి సంఘాల నేతలు, అధ్యాపకులు బుధవారం ఘనంగా సన్మానించారు. నేతలు కొండా యుగంధర్, సుకుమార్, హరి, నాగరాజు, అధ్యాపకులు ఉదయ్, జగదీష్, మధు హరీష్ రెడ్డి, రవి, కోటేశ్వరరావు పాల్గొన్నారు

అల్పాహారం వితరణ



టిఫిన్ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో ప్రసూతి ఆస్పత్రి వద్ద గర్భిణులు, వారి సహాయకులకు బుధవారం అల్పాహారం వితరణ చేశారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ భాస్కర్, అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సి.చక్రపాణి, కోశాధికారి పురుషోత్తమ నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, దాత ఎస్.సాధిక్, రామారావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తిరుపతి తుడా : నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం చేపట్టిన పారిశుద్ధ్య పనులను కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. నిమ్మకాయల వీధి, మిట్ట వీధి, రాములవారి గుడి వీధి, కాళికమ్మ గుడి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, అధికారులతో కలసి తనిఖీ చేశారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు కదలడం లేదని మండిపడ్డారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో డ్రైనేజీల శుభ్రంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా తొలగించాలని స్పష్టం చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మధు, డీఈలు రాజు, శిల్ప, సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

రాయితీ పథకాలపై అవగాహన

తిరుపతి కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీ పథకాలపై ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ వారు బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ దాసరి దేవరాజు మాట్లాడుతూ యువత ప్రభుత్వోద్యోగాలపై ఆధారపడకుండా, ఆసక్తిగల రంగం ఎంచుకుని ఉద్యోగాల కల్పన దిశగా పయనించాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీ సెంటర్ డీడీ రామమూర్తి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీహెచ్‌ఓ దొరస్వామిరెడ్డి, అధ్యక్షుడు సురేంద్ర, మునికృష్ణ, ఎస్‌బీఐ అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి కో–ఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి దేవరాజు

నేడు మెట్టు వ్యాపారుల 'వేడుకోలు'



మాట్లాడుతున్న లోకనాథం

తిరుపతి కల్చరల్ : టీటీడీ పరిపాలన భవనం వద్ద శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల నిరసన దీక్షకు గురువారంతో ఏడాది పూర్తయ్యిందని, అధికారుల పట్టించుకోకపోవడం దారుణమని వ్యాపారుల సంఘం కార్యదర్శి లోకనాథం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మండిపడ్డారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. టీటీడీ అధికారుల తీరు వ్యతిరేకిస్తూ గురువారం ఉదయం 10.30 గంటలకు టీటీడీ పరిపాలన భవనం వద్ద వెంకన్నకు వేడుకోలు పేరిట నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. నేతలు రెడ్డిప్రకాష్, పెంచలయ్య, యుగంధర్, చిరంజీవి, చిట్టిబాబు పాల్గొన్నారు.

రికార్డులు తారుమారు!

- కూటమి నేతల భూ దాహం
- రెవెన్యూ అధికారుల సహకారం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన అవినీతి భాగోతం

రామచంద్రాపురం: మండలంలోని రెవెన్యూ అధికారులు అవినీతి భాగోతం సోషల్ మీడియాలో బుధవారం వైరల్‌గా మారింది. మండలస్థాయి అధికారి ఉద్యోగ విరమణ పొందే సమయంలో ఆన్‌లైన్ రికార్డులను తారుమారు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు మరో రెవెన్యూ అధికారి సహకారం అందించినట్లు తెలుస్తోంది. వివరాలు.. రామచంద్రాపురం మండలం అనుప్పల్లెలో సర్వేనంబర్ 2/4లో ఓ రైతుకు 2.31 ఎకరాల భూమి ఉంది. సుమారు 26 ఏళ్లుగా ఆయన ఆ భూమిని సాగుచేసుకున్నాడు. అయితే ఏడాది క్రితం అనారోగ్య కారణంగా ఆ రైతు మృతి చెందాడు. ఇదే అదునుగా కూటమి నేతలు రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారుల సహకారంతో రైతు కుటుంబీకుల పేరు మీద ఉన్న భూమిని తమ అనుయాయులు ముగ్గురికి 77 సెంట్ల చొప్పున కట్టబెడుతూ ఆన్‌లైన్‌లోకి నమోదు చేయించేశారు. దీనిపై రైతు కుటుంబీకులు నిలదీయగా, టీడీపీ నేత ఒత్తిడితోనే రికార్డులు తారుమారు చేసినట్లు సదరు రెవెన్యూ అధికారి స్పష్టం చేసినట్లు సమాచారం. పైగా ఆర్‌డీఓ కోర్టులో అపీలు చేసుకోమని సలహా కూడా ఇచ్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారని, ఆన్‌లైన్‌లోకి ఎక్కించిన రెవెన్యూ అధికారి డిప్యుటేషన్‌పై నారాయణవనం వెళ్లారని, ఇప్పుడు తమ సమస్యను ఎవరు పరిష్కరిస్తారని బాధితులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో అవినీతి అధికారులు, అక్రమాలకు పాల్పడిన కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో నెటిజన్లు పెద్ద సంఖ్యలో డిమాండ్ చేస్తున్నారు.



రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం

తిరుచ్చిపై సీతారాముల విహారం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోని సీతారాములు బుధవారం బంగారు తిరుచ్చిపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం సీతారాములను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు.



ఊరేగుతున్న సీతారాములు

ఆటో డ్రైవర్స్ జిల్లా కమిటీ ఎన్నిక



జయచంద్ర, లక్ష్మయ్య, రమణ

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రంలో బుధవారం చేపట్టిన ఆటో డ్రైవర్స్ యూనియన్ 19వ జిల్లా మహాసభ ముగింపు సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎస్.జయచంద్ర, అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణయ్య, ఉపాధ్యక్షులుగా మురళి, భాస్కర్‌రెడ్డి, ఏ.విజయ్, ఎస్‌కే బాదుల్లా, కార్యదర్శులుగా వై.కుమార్, జి.వాసు, ఎస్.మణి, కోశాధికారిగా కె.గోపితో పాటు 25 కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

తిరుపతి రూరల్ : తనపల్లె సమీపంలోని పద్మగిరి కొండపై వెలసిన శ్రీబాలజ్ఞాన దండాయుధపాణి ఆడికృత్తిక మహోత్సవాలు ముగిసిన తర్వాత నిర్వహించే తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా సాగింది. పద్మగిరిపై నుంచి తనపల్లె చేరుకున్న ఉత్సవమూర్తిని కార్తికేయునిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదాలు, నీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రధాన అర్చకుడు షణ్ముఖ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



కార్తికేయునికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

పాఠశాలకు సామగ్రి వితరణ

తిరుపతి సిటీ : బైరాగి పట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు రూ.1.15 లక్షల విలువైన కంప్యూటర్, ర్యాక్స్, బీరువా, టేబుల్‌ను ఐడీబీఐ బ్యాంక్ ఎ ఏజీఎం శ్యాంసుందర్ వితరణగా అందజేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డీఈఓ కేవీఎన్ కుమార్ చేతుల మీదుగా అందించారు. ఐడీబీఐ బ్యాంక్ అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ సురేష్, రాజేష్, ఐటీసెల్ ధనంజయులు, భవిత కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, క్లస్టర్ హెచ్ఎం పరంధామనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమాద్రి బాబు, ఉపాధ్యాయులు బండి మధుసూదన్ రెడ్డి, పి.రేణుకాదేవి, కదిరి రవి, షబానా బేగం పాల్గొన్నారు



మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్

వినాయక ఉత్సవ కమిటీ కార్యాలయ ప్రారంభం

తిరుపతి కల్చరల్: ఇందిరామైదానం ప్రాంగణంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవం కమిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండప నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్